
సాక్షి
అనంతపురం
బుధవారం । 26 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.123

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.123 పలికింది. కనిష్టం రూ.96, సరాసరి రూ.105 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.2°/ 21.5°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. తుపాను వాతావరణం నెలకొంది. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

29 మండలాల్లో తేలికపాటి వర్షం



అనంతపురం అగ్రికల్చర్: యాడికి, ఆత్మకూరు మినహా జిల్లా అంతటా తేలికపాటి వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 29 మండలాల పరిధిలో 5.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. కుందుర్పి 16.2 మి.మీ, కంబదూరు 12, గుత్తి 11.4 మి.మీతో పాటు యల్లనూరు, పెద్దవడుగూరు, బ్రహ్మసముద్రం, గుంతకల్లు, తాడిపత్రి, కళ్యాణదుర్గం, పుట్లూరు, డి.హీరేహాళ్, రాప్తాడు తదితర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. జూలై సాధారణ వర్షపాతం 63.9 మి.మీ కాగా 37 మి.మీ మేర నమోదైంది. తేలికపాటి వర్షాల నడుమ పంటల సాగు కొనసాగుతోంది. పదును అయిన ప్రాంతాల్లో ఆగస్టు 5 వరకు ఖరీఫ్ కింద అన్ని రకాల పంటలు విత్తుకునేందుకు అనుకూలమని శాస్త్రవేత్తలు, అధికారులు తెలిపారు. కాగా రాగల రెండు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు తెలిపారు.

కందిపప్పు కిలో రూ.130

- మునిసిపాలిటీల్లో ప్రత్యేక కౌంటర్లు



అనంతపురం అర్బన్: మార్కెట్‌లో కందిపప్పు ధర భారీగా పెరిగినందున ప్రజలకు సరసమైన ధరతో అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా సరఫరాల అధికారి (డీఎస్‌ఓ) శోభారాణి మంగళవారం తెలిపారు. జిల్లాలోని అనంతపురం, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి, గుంతకల్లు మునిసిపాలిటీల పరిధిలో ప్రతేక కౌంటర్లు ఏర్పాటు చేశారన్నారు. ఈ కౌంటర్లలో కందిపప్పు కిలో రూ.130తో కుటుంబానికి ఒక కిలో చొప్పున అందిస్తారన్నారు. కౌంటర్లు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు తెరిచి ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇస్తారన్నారు. కందిపప్పుతో పాటు బియ్యం కూడా కిలో రూ.48తో ఇస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

రాప్తాడు రూరల్: నాయకత్వ లక్షణాలు పెంపొందించుకున్నప్పుడే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయగలుగుతామని ప్రధానోపాధ్యాయులకు సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. స్కూళ్ల నిర్వహణలో నాయకత్వ లక్షణాలపై ప్రధానోపాధ్యాయులకు అనంతపురం శివారులోని టీటీడీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండో విడత శిక్షణ కార్యక్రమాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఏర్పాట్లు, మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. పునాది అభ్యసన, గణిత పరిజ్ఞానం, మౌలిక సదుపాయాల కల్పన, పాఠశాల వ్యవస్థను సక్రమంగా నడిపేలా ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ సాయిరామ్, పెనుకొండ ఉపవిద్యాధికారి రంగస్వామి, రాష్ట్ర పరిశీలకులు పెంచలయ్య, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం.. పుష్కలం

- అంగన్‌వాడీ చిన్నారుల సూచీల్లో గణనీయమైన వృద్ధి
- వైఎస్సార్ సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలకు ఆసరా
- పౌష్టికాహారం సరఫరాపై ప్రత్యేక నిఘా వల్ల అందరికీ లబ్ధి
- 3.03 నుంచి 0.64 శాతానికి తగ్గిన బరువు తక్కువ చిన్నారులు
- టీడీపీ ఐదేళ్ల పాలనలో భారీగా పౌష్టికాహార లోపం చిన్నారులు

స్త్రీ, శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. పోషకవిలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందిస్తున్నాయి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందుతుండటంతో గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించి ఆరోగ్యవంతులుగా ఉంటున్నారు. ఇక చిన్నారులు పౌష్టికాహార లోపం నుంచి బయటపడ్డారు. క్రమం తప్పకుండా పౌష్టికాహార పంపిణీ, ఆరోగ్య పరీక్షల వల్ల అంగన్‌వాడీ లబ్ధిదారుల్లో గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్య సూచీలు గణనీయంగా మెరుగయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలకు వచ్చే ఆహారాన్ని దుర్వినియోగం చేస్తూ కొంతమంది 'పెద్దలు' అమ్ముకునేవారు. చిన్నారులకు కోడిగుడ్లు సక్రమంగా అందేవి కావు. 2019 కి ముందు టీడీపీ హయాంలో ఉన్న ఈ విధానాలకు వైఎస్సార్‌సీపీ సర్కారు చెక్ పెట్టింది. ప్రతి చిన్నారీ ఆరోగ్యంగా ఉండాలని, సంపూర్ణ పౌష్టికాహారం అందాలని, ఎక్కడైనా అవకతవకలు జరిగితే వారిపై కఠిన చర్యలుంటాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయానా హెచ్చరించారు. దీంతో అంగన్‌వాడీ సెంటర్ల పనితీరులో పూర్తి స్థాయిలో మార్పులు కనిపించాయి.

చిన్నారుల్లో గణనీయమైన మార్పులు

ప్రస్తుతం అనంతపురం జిల్లాలో 1.35 లక్షల మంది చిన్నారులు అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చి పౌష్టికాహారం తీసుకుంటున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందించడం ఒకెత్తయితే వారిలో ఎదుగుదలను అంచనా వేయడం మరొక ఎత్తు. ప్రధానంగా చిన్నారుల్లో రక్తహీనత, బరువు తక్కువగా ఉంటే వారికి మంచి ఆహారం అందించడం, ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు ఇవే ముఖ్యమైన సూచీలు. ఈ సూచీల్లో గడిచిన నాలుగేళ్లలో భారీగా అభివృద్ధి కనిపించింది. తెలుగుదేశం హయాంలో పరిస్థితికీ, ఇప్పటికీ ఎంతో మార్పు కనిపిస్తోంది. నాలుగేళ్ల క్రితం 3.03 ఉన్న బరువు తక్కువ చిన్నారుల శాతం ప్రస్తుతం 0.64 శాతానికి తగ్గింది.

పటిష్ట పర్యవేక్షణ

జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో చిన్నారులే కాదు గర్భిణులు, బాలింతలూ కలిసి 1.40 లక్షల మంది పౌష్టికాహారం పొందుతున్నారు. ఈ కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేయడమే కాదు, నెలకోసారి సూచీల్లో సాధించిన ప్రగతిపైన సమీక్ష చేస్తున్నారు. చిన్నారులకు బాలామృతం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, చిక్కీలు, రాగిపిండి, ఎండు ఖర్జూరం, సజ్జ/జొన్న పిండి, అటుకులు వంటి బలవర్ధక పదార్థాలు ఇవ్వడం ద్వారా వారు రక్తహీనత అధిగమిస్తున్నారు. ఇవన్నీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్నదానిపై నిఘా పెంచడం వల్ల ప్రతి ఒక్కరికీ ఆహార ఫలాలు దరి చేరుతున్నట్టు తేలింది.



అనంతపురంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్

2014-19 మధ్య చిన్నారుల పరిస్థితి

కేటగిరీ	సంఖ్య	శాతం
మొత్తం చిన్నారులు	1,48,118	---
సాధారణ చిన్నారులు	1,23,298	83.24
బరువు తక్కువ	4,493	3.03
ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం	3,976	2.68
వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడం	16,351	11.03

2019-23 మధ్య చిన్నారులు

కేటగిరీ	సంఖ్య	శాతం
మొత్తం చిన్నారులు	1,34,844	---
సాధారణ చిన్నారులు	1,28,508	95.30
బరువు తక్కువ	866	0.64
ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం	1,020	0.76
వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడం	1,712	1.27

మెండుగా పౌష్టికాహారం



గతంలో బాలింతలకు, చిన్నారులకు నెలకు 8 కోడి గుడ్లు మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు నెలకు 25 గుడ్లు ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం కూడా నాణ్యతగా పెడుతున్నారు. చిన్నారులకు అందే పౌష్టికాహారంలో కొరతే లేదు.
–రేవతి, అంగన్‌వాడీ టీచర్, గుల్జార్‌పేట, అనంతపురం

సకాలంలో పౌష్టికాహారం



మా అంగన్‌వాడీ కేంద్రంలో 26 మంది చిన్నారులు ఉన్నారు. గతంతో పోలిస్తే చిన్నారులకు ఇప్పుడు సకాలంలో పౌష్టికాహారం అందుతోంది. ఇక్కడ చిన్నారులకు అందించే పౌష్టికాహారం, వాటి నాణ్యత చూసి తల్లిదండ్రులు చాలా సంతోషపడుతున్నారు.
–తిప్పీరమ్మ, అంగన్‌వాడీ టీచర్, మామడూరు, బ్రహ్మసముద్రం మండలం

ప్రత్యేక శ్రద్ధతోనే సాధ్యం



అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గతంలో బరువు తక్కువ చిన్నారులకే కోడిగుడ్లు ఇచ్చేవాళ్లు. ఇప్పుడు అందరికీ ఇస్తున్నాం. ఆహారం సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఒక్క సెంటర్‌లో కూడా పౌష్టికాహారం విషయంలో సమస్య రాకుండా చూస్తున్నాం.
–శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్

ఉమ్మడి జిల్లాకు 37 విద్యుత్ సబ్ స్టేషన్లు

- రూ.95కోట్ల నిధులు మంజూరు

అనంతపురం టౌన్: విద్యుత్ అంతరాయాలు అరికట్టి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు కొత్తగా 37 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన సబ్ డివిజన్ల ఈఈలతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో 5 సబ్ స్టేషన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మొత్తం 37 సబ్ స్టేషన్లకు రూ.95 కోట్లమేర నిధులను మంజూరైనట్లు చెప్పారు. సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. సబ్ స్టేషన్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. లో ఓల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను పంపాలన్నారు. అనంతపురం డివిజన్ పరిధిలో ఉప్పరపల్లి, కొడిమి, ఆలమూరు తదిత ప్రాంతాల్లో నూతన సబ్ స్టేషన్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో స్థలాలను గుర్తించినట్టు తెలిపారు. వీటిలో నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.

డీఈఓ కార్యాలయంలో టీటీసీ సర్టిఫికెట్లు

రాప్తాడురూరల్: టీటీసీ–22 డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) పరీక్షల సర్టిఫికెట్లు అనంతపురం కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. హాల్‌టికెట్, ఆధార్‌కార్డ్ చూపి టీటీసీ సర్టిఫికెట్ తీసుకెళ్లాలని డీఈఓ సూచించారు.

'ఓపెన్' పది, ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

రాప్తాడురూరల్: ఓపెన్ పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాలో పదో తరగతిలో 402 మంది విద్యార్థులకు గాను 291 మంది (72.39 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 934 మంది విద్యార్థులకు గాను 709 మంది (75.91 శాతం) పాసయ్యారు. www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో మార్కుల జాబితాలు అందుబాటులో ఉంచారని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్ తెలిపారు. అడ్మిషన్ నంబర్ లేదా హాల్‌టికెట్ నంబరు ద్వారా మార్కుల జాబితా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రైతులకు ప్రయోజనం

- జిల్లాలో రెండు ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటు
- వర్చువల్ విధానంలో యూనిట్లకు సీఎం శంకుస్థాపన

అనంతపురం అర్బన్: జిల్లాలో రెండు ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటు ద్వారా టమాట, ఇతర కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేసే దాదాపు 60 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కలెక్టర్ గౌతమి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,719 కోట్లతో తలపెట్టిన 11 ఆహారశుద్ధి ప్రాజెక్టులకు మంగళవారం ముఖ్యమంత్రి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. జిల్లాలో కళ్యాణదుర్గం మండలం వెంకటంపల్లి, కుందుర్పి మండలం బండమీదపల్లి గ్రామాల పరిధిలో రూ.11 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమి, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ గౌతమి, ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, మహిళా రైతు కుందిర్పమ్మ మాట్లాడారు. ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో రెండు ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసుకుని ప్రాసెసింగ్ సెంటర్లు నిర్వహించేకునేలా ప్రభుత్వం ప్రాత్సాహం అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఏటా 13.25 లక్షల టన్నుల టమాటాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కుందుర్పి మండలం వంటి మారుమూల సరిహద్దు ప్రాంతాలకు గతంలో ఎప్పుడూ ఇటువంటి ప్రోత్సాహం లభించలేదన్నారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లాలో ఏర్పాటు చేసే ఒక్కో ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ (పీపీసీ) కోసం రూ.5.50 కోట్ల మంజూరుతో రైతులకు ఎంతో మేలు చేశారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లకు సంబంధించి భూమిపూజ శిలాఫలకాలను కలెక్టర్, తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఎంపీపీ మారతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, సర్పంచ్ చంద్రానాయక్, కుందుర్పి జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, రైతులు పాల్గొన్నారు.



ప్రాసెసింగ్ యూనిట్ల భూమిపూజ సందర్భంగా శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమి తదితరులు

ఎఫ్‌పీఓలను అనుసంధానం చేయాలి



జిల్లాలో రెండు ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్లు (పీపీసీలు) ఏర్పాటు చేయడం సంతోషదాయకం. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నాం. మరికొన్ని పీపీసీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆర్బీకేలు, ఎఫ్‌పీఓలు అనుసంధానం చేయడం ద్వారా వాటి సామర్థ్యం పెంచి రైతులకు మరింత సేవ చేసే అవకాశం ఉంటుంది. – మల్లారెడ్డి, ఎకాలజీ సెంటర్ డైరెక్టర్

రైతులకు ఎంతో మేలు చేస్తున్నారు



వివిధ సంక్షేమ పథకాల ద్వారా రైతులకు మీరు (సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి) ఎంతో మేలు చేస్తున్నారు. మేము రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) ఏర్పాటు చేసుకున్నాం. సంఘంలో ఉన్న మూడు వేల మంది సభ్యులం రూ.7.24 లక్షలు వాటా వేసుకున్నాం. నాబార్డు ద్వారా మా సంఘానికి రూ.5 లక్షల గ్రాంట్ వచ్చింది. వ్యాపారాలు చేసి రూ.22 లక్షల ఆదాయం ఆర్జించాం. రైతులు ఇబ్బంది పడకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా అవసరమైనవన్నీ పొందుతూ అభివృద్ధి చెందుతున్నాం. రైతులకు, ప్రజలకు మీరు బంగారు భవిష్యత్తు అందిస్తున్నారు. ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా టమాట రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.
– ముఖ్యమంత్రితో మాట్లాడిన ఎఫ్‌పీఓ అధ్యక్షురాలు, మహిళా రైతు కుందిర్పమ్మ

తండాలో సిలిండర్ పేలుడు






తీవ్రంగా గాయపడిన ఆర్.వి.సరోజమ్మ, ఆర్.దేవమ్మ, ఎస్.సరోజ, ఆర్.వి.మాధవి

- నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు

వజ్రకరూరు: వెంకటాంపల్లి పెద్దతండా (రూప్లానాయక్‌తండా)లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో నలుగురు మహిళలు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు... తండాకు చెందిన ఆర్.వి. సరోజమ్మ ఇంటిలో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ అయిపోయింది. మరొక సిలిండర్‌కు రెగ్యులేటర్ అమర్చేందుకు రాకపోవడంతో పక్కింటి వారి సహకారంతో పూర్తి చేశారు. అనంతరం స్టౌ వెలిగించబోతే సిలిండర్ పేలి భారీ శబ్దం వచ్చింది. ఈ ప్రమాదంలో ఆర్.వి.సరోజమ్మ, ఆర్.వి.మాధవితో పాటు పక్కింట్లోని వారు ఆర్.దేవమ్మ, ఎస్.సరోజ తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి కిచెన్ గది పైకప్పు ధ్వంసమైంది. వస్తువులన్నీ చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. గ్రామస్తులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి.. గాయపడిన నలుగురు మహిళలనూ 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నలుగురినీ మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి పంపించారు. ఎస్ఐ రాజశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి దారి తీసిన కారణాలపై ఆరా తీశారు.

మెరుగైన వైద్యం అందించండి

గ్యాస్ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఫోన్ ద్వారా బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారులకు ఫోన్ చేసి, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. క్షతగాత్రులను ఉరవకొండ నుంచి అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచ్ శివాజీనాయక్, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బసవరాజు, నాయకులు కురుబ గోవిందు, శంకర్ తదితరులు వాహనాలు సమకూర్చారు.




గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో ధ్వంసమైన ఆర్.వి.సరోజమ్మ ఇల్లు

ప్రాజెక్టుల్లో జలసవ్వడి

అనంతపురం సెంట్రల్: భారీ వర్షాలతో తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర జలాశయానికి 72,488 క్యూసెక్కుల భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. టీబీ డ్యాం ప్రస్తుతం 31.658 టీఎంసీల నీటిమట్టానికి చేరుకుంది. శ్రీశైలం జలాశయానికి నిలకడగా వరద నీరు వస్తోంది. ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు వదిలేస్తుండడంతో 27,979 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 215 టీఎంసీలు నీటి నిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుతం 36.66 టీఎంసీల నీరు ఉంది.



తుంగభద్ర జలాశయం

తొలగిన బాలారిష్టాలు

- మద్దికెర – గుంతకల్లు బైపాస్ లైన్ రైలు మార్గం సిద్ధం

గుంతకల్లు: దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న మద్దికెర- మల్లప్పగేట్ – గుంతకల్లు నార్త్ లైన్ లింక్ పనులకు ఎట్టకేలకు బాలారిష్టాలు తొలిగాయి. గుంటూరు – గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలోని డోన్‌-గుంతకల్లు సెక్షన్‌లో మద్దికెర-మల్లప్పగేట్-గుంతకల్లు మధ్య దాదాపు 11 కిలోమీటర్ల డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. భద్రతా కమిషనర్ ప్రణ్‌జీవ్ సక్సేనా, రైల్వే నిర్మాణాల విభాగం, సిగ్నల్ అండ్ టెలికామ్, ఎలక్ట్రిఫికేషన్ అధికారులు, డీఆర్ఎం మనీష్ అగర్వాల్ తదితరుల నేతృత్వం లోచేపట్టిన తనిఖీలు మంగళవారం ముగిశాయి. తొలుత ప్రత్యేక రైలు, తర్వాత మోటార్ ట్రాలీలో రైలు మార్గాన్ని క్షుణంగా తనిఖీ చేశారు. కమ్మీల మధ్య స్లీపర్లు, కంకర, మోరీలు, ఆర్‌యూబీల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. పవర్‌కార్‌లో విద్యుత్ లైన్‌ను తనిఖీ చేశారు. చివరగా వేగ నిర్ధారణ పరీక్షలో భాగంగా ప్రత్యేక రైలు దాదాపు 100 కి.మీకి పైగా స్పీడ్‌తో పరుగులు పెట్టించారు. ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులూ లేవని భద్రతా కమిషనర్ సక్సేనా నిర్ధారించారు. రైల్వే జీఎం నుంచి అనుమతులు రాగానే ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు ప్రారంభిస్తామన్నారు. తనిఖీల్లో సీనియర్ డీఎస్‌టీఈ వైపీ రెడ్డి, సీనియర్ డీఓఎం శ్రావణ్, సీనియర్ డీఈఎన్ సంజీవ్‌కుమార్, సీనియర్ డీఈఈ గంగరాజు, సీనియర్ డీఎస్ఓ చంద్రశేఖర్, సీనియర్ డీఈటీఆర్‌డీ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



మద్దికెర-గుంతకల్లు రైలు మార్గాన్ని తనిఖీ చేస్తున్న భద్రతా కమిషనర్, డీఆర్‌ఎం

క్లుప్తంగా

‘108’లో ప్రసవం



నవజాత శిశువును అందజేస్తున్న ఈఎంటీ రాకేష్‌రెడ్డి

యాడికి: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు... యాడికి గ్రామానికి చెందిన లలిత మూడో సారి గర్భం దాల్చింది. ఈ క్రమంలో నెలలు నిండి సోమవారం రాత్రి పది గంటలకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు 108 అంబులెన్స్‌లో తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాన్పు కష్టం కావడంతో వైద్యుల సిఫారసు మేరకు 108 అంబులెన్స్‌లో అనంతపురానికి తీసుకెళుతుండగా నాయనపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పైలెట్ చిన్న రంగడు సాయంతో ఆమెకు ఈఎంటీ రాకేష్‌రెడ్డి ప్రసవం చేశారు. పండంటి మగబిడ్డకు లలిత జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

రైల్వే జంక్షన్‌లో విస్తృత తనిఖీలు



ప్లాట్‌ఫాంపై తనిఖీ చేస్తున్న పోలీసులు

గుంతకల్లు: నేరాల నియంత్రణలో భాగంగా గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో సివిల్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది మంగళవారం సాయంత్రం విస్తృత తనిఖీలు చేపట్టింది. గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఆర్‌పీఎఫ్ అధికారులు, దాదాపు 60 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, డాగ్‌స్క్వాడ్‌తో కలసి రైళ్లలో, ప్లాట్‌ఫామ్‌లు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అనుమానితుల వేలిముద్రలు సేకరించారు. కార్యక్రమంలో సీఐలు రామసుబ్బయ్య, గణేష్, జీఆర్‌పీ సీఐ నగేష్‌బాబు, ఆర్‌పీఎఫ్ బెన్నయ్య, ఎస్‌ఐలు సురేష్, విజయ్‌కుమార్ తదితరులుపాల్గొన్నారు.

శింగనమల సీహెచ్‌సీ తనిఖీ



మాట్లాడుతున్న కేరళ వైద్య బృందం

శింగనమల: స్థానిక సీహెచ్‌సీని మంగళవారం కేరళకు చెందిన పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ వైద్య బృందం తనిఖీ చేసింది. ఆస్పత్రిలోని అన్ని వార్డులు, ల్యాబ్, ఓటీ, మందుల గదులతో పాటు పలు రికార్డులను బృందం సభ్యులు డాక్టర్. సురేష్‌కుమార్, డాక్టర్ అనిల్ కుమార్ పరిశీలించారు. అందుతున్న సేవలపై రోగులతో ఆరా తీశారు. అనంతరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ నాయక్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు శివశంకర్ రెడ్డి, వైద్యులు అజేంద్ర, రమ్య, రంగనాయకులు, సిబ్బందితో మాట్లాడారు.





గూగూడులో దర్శనమిస్తున్న కుళ్లాయిస్వామి పీర్లు

కుళ్లాయిస్వామి నమోనమః

గూగూడు జనసంద్రమైంది. మొహర్రం సందర్భంగా కుళ్లాయిస్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి నుంచే గూగూడు భక్తులతో కిక్కిరిసిపోయింది. మంగళవారం జంట ఆలయాల వద్ద దైవ దర్శనానికి భక్తులు బారులు తీరారు. చక్కెర చదివింపులతో మొక్కులు తీర్చుకున్నారు. కుళ్లాయి స్వామి నమోనమః అంటూ భక్తిశ్రద్ధలతో భక్తులు కీర్తించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



పీర్ల చావిడి ఎదుట మండుతున్న అగ్నిగుండం



భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీసులు



స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



గూగూడులో వెలసిన దుకాణాలు



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

చట్టం ముందు అందరూ సమానమే

- మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- కంబదూరు ఘటనలో బాధ్యుడిపై చర్యలకు సిఫారసు
- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: చట్టం ముందు అందరూ సమానమేనని రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. కంబదూరు పోలీసు స్టేషన్‌లో జరిగిన ఘటనపై మంగళవారం ఆమె ‘సాక్షి’తో మాట్లాడారు. మహిళల రక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, అత్యాచారం వంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా గ్రామ స్థాయి నుంచే ప్రత్యేక భద్రత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. తప్పు చేసిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. న్యాయం కోరుతూ కంబదూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళ పట్ల హోంగార్డు అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. రాబోవు రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు హోం గార్డు శివానందపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసు శాఖకు సిఫారసు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆపదలో సమయంలో ప్రతి మహిళ దిశా యాప్ ఎస్‌ఓఎస్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

హోంగార్డు సస్పెన్షన్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: కంబదూరు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు శివానందను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల కంబదూరు పోలీసు స్టేషన్‌కు న్యాయం కోసం వెళ్లిన మహిళ పట్ల హోం గార్డు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై విచారణ అనంతరం హోంగార్డును సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి పట్ల సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఉరవకొండ/రాప్తాడు రూరల్: గుత్తి మండలం రజాపురం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, ఉరవకొండలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ మేరకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎస్ఎస్ ఉషారాణి, సునీత మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఉరవకొండలోని కళాశాలలో సీఈసీలో ఎస్సీలకు 15, ఎస్టీలకు రెండు, ఓసీలకు ఒకటి చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. అలాగే ఎంఈసీ గ్రూపులో ఎస్సీలకు 26, ఎస్టీలకు రెండు, బీసీలకు రెండు, ఓసీలకు ఒకటి, రజాపురంలోని కళాశాలలో ఎంపీసీ గ్రూపులో ఎస్సీలకు రెండు, ఎస్టీలకు రెండు, బైపీసీలో ఎస్టీలకు ఒక సీటు చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ (రెగ్యులర్)లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 360కు పైగా మార్కులు సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తులను బుధవారం సాయంత్రం 4 గంటల్లోపు అందజేయాలన్నారు. ఎంపిక జాబితాను ఈ నెల 27న ప్రకటిస్తామన్నారు.

టీడీపీ అధిష్టానం నుంచి ఆదేశాలట!

- ఓటర్ల ఆధార్, మొబైల్ నంబర్లు సేకరిస్తున్న టీడీపీ బీఎల్‌ఏలు
- కొడిమి గ్రామంలో అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: ఓటర్ల జాబితాలో పేర్లు ఉండేవారి నుంచి ఆధార్ కార్డ్, మొబైల్ నంబర్లను తెలుగుదేశం పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏ) సేకరిస్తున్నారు. అది కూడా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం చేపడుతున్న ‘ఓటరు జాబితా ప్రత్యేక సవరణ’ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌ఓ) సమక్షంలోనే వివరాలు సేకరిస్తుండడం గమనార్హం. ఇళ్ల వద్దకు బీఎల్‌ఓలు వెళ్లి వివరాలు తీసుకుంటుండగా...పక్కనే ఉంటున్న టీడీపీ బీఎల్‌ఏలు ఓటర్ల ఆధార్, మొబైల్ నంబర్లు సేకరిస్తున్నారు. ఇలా ఎందుకు సేకరిస్తున్నారని అడిగితే ‘మాకు పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు ఉన్నాయ’ని చెబుతున్నారు.

డోర్ టు డోర్ తిరుగుతున్న బీఎల్‌ఓలు

‘ఓటరు జాబితా ప్రత్యేక సవరణ’ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటా తిరుగుతూ ఓటర్ల వివరాలు పరిశీలిస్తున్నారు. ఓటర్లు ఉన్నారా..వేరే ప్రాంతానికి మారారా? ఎవరైనా చనిపోయారా? కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునే వయస్సు ఉన్న వారు ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీసి అవసరమైన ధ్రువీకరణపత్రాల (ఆధార్‌కార్డు తదితర) వివరాలు తీసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆయా పార్టీల తరఫున ఉండే బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏ) ఈ ప్రక్రియను పరిశీలించొచ్చు. బీఎల్‌ఓల వెంట వెళ్లి పరిశీలిస్తూ ఏవైనా అభ్యంతరాలు ఉంటే బీఎల్‌ఓ, ఆపై అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.

కొడిమిలో అభ్యంతరం తెలిపిన వైఎస్సార్‌సీపీ బీఎల్‌ఏ, నాయకులు

మంగళవారం అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామంలో బీఎల్‌ఓ సుస్మిత ఓటరు జాబితా ఆధారంగా ఇంటింట తిరిగారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ బీఎల్‌ఏ చంద్ర, నాయకుడు తిరుపాల్‌రెడ్డి, టీడీపీ బీఎల్‌ఏ యల్లప్ప తదితరులు ఉన్నారు. మొదటి ఇంటివద్దనే టీడీపీ బీఎల్‌ఏ యల్లప్ప ఓటర్ల ఆధార్, ఫోన్ నంబర్లు తీసుకున్నాడు. రెండో ఇంటివద్ద కూడా ఇలానే తీసుకోవడంతో వైఎస్సార్‌సీపీ బీఎల్‌ఏ, నాయకులు అభ్యంతరం తెలిపారు. ఓటర్ల నుంచి ఆధార్ వివరాలు ఎందుకు తీసుకుంటున్నావని ప్రశ్నించగా...‘మాకు పైనుంచి తీసుకోమని చెప్పారు’ అంటూ సమాధానమిచ్చాడు. బీఎల్‌ఓ సుస్మిత కూడా అడ్డు చెప్పినా వినకుండా యల్లప్ప వివరాలు తీసుకున్నాడు. చాలా చోట్ల టీడీపీ బీఎల్‌ఏలు ఇదే విధంగా ఓటర్ల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.



కొడిమిలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న బీఎల్‌ఓ సుస్మిత

బీఎల్‌ఏలకు వివరాలు ఇవ్వొద్దు

ఓటర్ల జాబితా పరిశీలనకు ఇంటింటా తిరుగుతున్న బీఎల్‌ఓలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొచ్చు. అంతేకాని పార్టీల తరఫున ఉండే బీఎల్‌ఏలకు ఎలాంటి వివరాలూ ఇవ్వొద్దు. వారు బీఎల్‌ఓల వెంట తిరుగుతూ ఉన్న ఓట్లు పోకుండా, లేనిఓట్లు ఎక్కకుండా చూడొచ్చు. అంతేకాని ఓటర్ల నుంచి వ్యక్తిగత వివరాలు తీసుకోకూడదు. వీటిపై ఫిర్యాదులు వస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీధరమూర్తి, అడిషనల్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి అనంతపురం రూరల్ మండలం

‘ఆర్డీటీకి అనిమల్ వెల్ఫేర్ బోర్డు గుర్తింపు ఇవ్వండి’



వినతిపత్రం ఇస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం క్రైం: కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ జాయింట్ కమిషనర్ సుజిత్ కుమార్ దత్తను మంగళవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఎంపీ రంగయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్డీటీ నిర్వహిస్తున్న పశు సంక్షేమానికి అనిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

పార్టీ విధివిధానాలు పాటించకపోతే చర్యలు తప్పవు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



అనంతపురం క్రైం: పార్టీ విధివిధానాలను ఎవరు ధిక్కరించినా ఉపేక్షించబోమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తలారి బయన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల ఎంపీ తలారి రంగయ్యపై నిరాధార ఆరోపణలు చేస్తూ పార్టీ నిబంధనలను ఉల్లంఘించడమే ఇందుకు కారణమన్నారు.

నడుముకు అతుక్కుపోయిన ప్లాస్టిక్ బిందె

యాడికి: వేడి నీళ్లు తరలిస్తున్న ఓ మహిళ నడుముకు ప్లాస్టిక్ బిందె అతుక్కుపోయి తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు .. యాడికి మండలం పిన్నేపల్లికి చెందిన మాధవి మంగళవారం ఉదయం ప్లాస్టిక్ బిందెలోని నీటిని హీటర్‌తో వేడి చేసింది. మరగకాచిన నీటిని ఇంటి బయలకు తీసుకెళ్లేందుకు చంకలో పెట్టుకున్న సమయంలో నీళ్ల వేడికి ప్లాస్టిక్ బిందె కరిగి ఆమె చర్మానికి అతుక్కుపోయింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను యాడికి పీహెచ్‌సీకి తరలించి, చికిత్స చేయించారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి



మృతుడు రామ్‌చరణ్

కుందుర్పి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం కలిగొళిమి గ్రామానికి చెందిన నిర్మల కుమారి, ఓబులేసు దంపతులకు కుమారుడు రామ్‌చరణ్ (11) మంగళవారం ఉదయం స్నేహితులతో కలసి క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు కాలికి తగలడంతో రామ్‌చరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి ఎంబీఏ నాల్గో సెమిస్టర్, పీజీ డిప్లొమా పరీక్షలు

రాప్తాడు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ నాల్గో సెమిస్టర్, పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షలు బుధవారం (నేడు) నుంచి జరగనున్నాయి. ఈ మేరకు అనంతపురం ఆర్ట్స్ కళాశాలలోని ప్రాంతీయ కార్యాలయం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శేషారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పూర్తి వివరాలకు 73829 29602లో సంప్రదించవచ్చు.

హెచ్‌ఐవీ నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి జేడీ డాక్టర్ కామేశ్వరప్రసాద్



మాట్లాడుతున్న డాక్టర్ కామేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం: ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించే హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షల నివేదికలను ఎప్పటికప్పుడు ఎస్‌ఓసీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ల్యాబ్ టెక్నీషియన్ల (ఎల్‌టీ)కు క్లీషియన్లకు ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి జేడీ డాక్టర్ కామేశ్వరప్రసాద్ సూచించారు.రక్తపరీక్షల నివేదికలను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలని అంశంపై మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎల్‌టీలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో స్క్రీనింగ్ పరీక్షలు మాత్రమే చేపట్టాలని, వ్యాధి లక్షణాలు గుర్తిస్తే సంబంధిత వ్యక్తిని సమీపంలోని స్టాండ్ అలోన్ ఐసీటీసీకి రెఫర్ చేయాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ... నెలవారీ నివేదికలను నిర్దేశిత సమయంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపాలని సూచించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో జీవించే వారి పట్ల వివక్ష చూపకుండా ఉత్తమ సేవలందించాలన్నారు. ప్రతి నెలా 17వేల మందికి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ చెన్నకేశవులు, డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి సుకుమార్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ డీపీఎం వెంకటరత్నం, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్ పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండండి

వాతావరణంలో భారీగా చోటు చేసుకున్న మార్పుల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని, ఈ అంశంపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ అన్నారు. జాతీయ వాతావరణ మార్పు– ఆరోగ్య సమస్యల పరిష్కారం అనే కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందస్తుగా ప్రజలు పరిసరాలు, ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా ఎరువుల అమ్మకాలు

అనంతపురం అగ్రికల్చర్: ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువుల అమ్మకాలు పెంచి, రైతులకు మేలు చేకూర్చాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారున. మంగళవారం ఆయన గుంటూరు నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వర్షాలు, రాయితీ విత్తన పంపిణీ, ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం, ఆగస్టు మొదటి వారం వరకు పంటల సాగు అంచనా, ఆ తర్వాత ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ, పంటల సాగు లక్ష్యం, అందులో చిరుధాన్యాల సాగు తదితర అంశాలపై దిశా నిర్దేశనం చేశారు. నానో యూరియా వాడకంపై ఆర్‌బీకే వేదికగా రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. 50 కిలోల యూరియా బస్తా రూ.267 ఉండగా అదే స్థాయిలో పోషకాలు కలిగిన 500 మి.లీ నానో యూరియా బాటిల్ రూ.225 ప్రకారం అందుబాటులో ఉందన్నారు. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాల ద్వారా రైతుల్లో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎం కిసాన్ ఈకేవైసీ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని మొదలు పెట్టాలన్నారు. యంత్రసేవ, కిసాన్ డ్రోన్లు, మట్టి నమూనాలు, భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాల సేకరణ, నియోజక వర్గాల ప్రయోగశాలల పనితీరు, నకిలీ, నాసిరకం, నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగించే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తనిఖీ బృందాల పనితీరు గురించి ఆరాతీశారు. డీఏఓ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ.. కోటా మేరకు ఎరువులు అందుబాటులోకి రావడంతో ఆర్‌బీకేలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఎంపీఈఓలు, ఆర్‌బీకే అసిస్టెంట్ల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు క్షేత్ర స్థాయి పర్యటనలతో రైతులకు అందుబాటులో ఉంటున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

గణిత ఫోరం మండల కమిటీ ఏర్పాటు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని నార్త్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు గణిత ఫోరం కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా మల్లినాథ్, ఆర్థిక కార్యదర్శిగా వెంకటేశులు, గౌరవ సలహాదారులుగా మధుసూదన్, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా కేవీ ప్రసాద్, హేమలత, అరుణకుమారి, ఉమాదేవి, సుజిత, రామకృష్ణ, కౌన్సిలర్లుగా నారాయణ, రమణారెడ్డిని ఎంపిక చేసినట్లు మండల అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు.

వేంకటేశ్వర వైభవాన్ని ప్రారంభించిన కలెక్టర్


శ్రీవేంకటేశ్వర వైభవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే శ్రీ వేంకటేశ్వర వైభవం కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమి మంగళవారం ప్రారంభించారు. నగరంలోని శ్రీ సెవన్ ఫంక్షన్ హాలులో ఈనెల 28,29 తేదీల్లో అధిక శ్రావణాన్ని పురస్కరించుకొని దశమి, ఏకాదశి పర్వదినాల్లో తిరుమలలో జరిగే ప్రతి కార్యక్రమాన్నీ శ్రీ వైకుంఠ వాసుడి సేవలో ఒకరోజు పేరిట నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఊంజల సేవ, అష్టదళ పద్మార్చన, సహస్ర దీపాలంకరణ, పవళింపు సేవలు తొలిరోజు సాగుతాయన్నారు. మరుసటి రోజు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, తోమాల సేవ, తిరుప్పాడ సేవ, కల్యాణోత్సవం, పవళింపుసేవలు ఉంటాయని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

బాలికలకు నగదు ప్రోత్సాహకాలు


బాలికలకు నగదు బహుమతులు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

అనంతపురం కల్చరల్: ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. మంగళవారం ఆదరణ సేవా హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇటీవల పదో తరగతిలో 560కి పైగా మార్కులు సాధించిన శారదా పాఠశాల విద్యార్థినులకు ముగ్గురికి రూ.3 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ ముంతాజ్, హెచ్‌ఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం


ఆత్మకూరు పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆత్మకూరులో మంగళవారం పీర్ల స్వాములకు ప్రత్యేకంగా వెండి ఆభరణాలను అలంకరించారు. మండలంలో ఆత్మకూరు, పి.యాలేరు, సనప, తలుపూరు, తోపుదుర్తి, ముట్టాల , సిద్దరాంపురం గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆత్మకూరులో బుధవారం చిన్న సరిగెత్తు నిర్వహించనున్నారు. సాయంత్రం వన్నూర్‌స్వామి గ్రామోత్సవం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

చిన్నారులకు మెరుగైన సేవలు అందించాలి


వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అనంతపురం క్రైం: చిన్నారులకు అందించే సేవలపై నిర్లక్ష్యం తగదని, అడ్మిషన్‌లో ఉన్నవారికి మెరుగైన సేవలు అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు వైద్యులను ఆదేశించారు. మంగళవారం జీజీహెచ్‌లోని చిన్నపిల్లల వార్డును సూపరింటెండెంట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఐసీయూ, వివిధ యూనిట్లను ఆయన పరిశీలించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీల పర్యవేక్షణపై ఆరా తీశారు. కేసు షీటును పక్కాగా నమోదు చేస్తున్నారా అని ఆరా తీశారు. శానిటేషన్ ఏవిధంగా చేడుతున్నారా అని స్టాఫ్‌నర్సులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు రౌండ్ ద క్లాక్ సేవలందాలన్నారు. ప్రాణాంతకమైన కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ వైపీ రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్లు మంజు, రజిని, తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు అమ్మవారి శాలలో శ్రావణ గౌరీ వ్రతం చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

• నేత్రపర్వం..శ్రావణ గౌరీ వ్రతం

నగరంలోని కొత్తూరు అమ్మవారిశాలలో శ్రావణ గౌరీ వ్రతం నేత్రపర్వంగా సాగింది. శ్రీలక్ష్మీ ఆది నారాయణ స్వామికి సామూహిక, శ్రావణ మంగళవారం పూజలు నిర్వహించారు. అధిక మాసం కావడంతో కొత్తూరు అమ్మవారిశాలలో వందల సంఖ్యలో మహిళలు అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఏకరూప వస్త్రాలు ధరించి, వ్రతం ఆచరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ప్రతి ఇంటి నుంచి తెచ్చిన 158 తీపి పదార్థాలు, మరో 158 వివిధ రకాల పూజా ద్రవ్యాలు, పండ్లతో ప్రధాన అర్చకులు భక్తులతో వ్రతం ఆచరింపజేశారు. లోక కల్యాణార్థం అమ్మవారిశాలలో వ్రతాలు ఆచరిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రావణ మంగళవారాలు, శుక్రవారాలు ప్రత్యేక పూజలు, అలంకరణలు జరుగుతాయన్నారు. అనంతరం అమ్మవారికి అలంకరించిన నైవేద్యాలు, అన్నప్రసాద వితరణ జరిగాయి.

– అనంతపురం కల్చరల్:


పూజల్లో పాల్గొన్న మహిళలు




కొత్తూరు అమ్మవారి శాలలో లక్ష్మీఆదినారాయణ స్వామి , లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

పదోన్నతులు కల్పించండి

అనంతపురం: వర్సిటీ బోధనేతర ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఆల్ ఏపీ వర్సిటీస్ నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటప్ప రెడ్డి విన్నవించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డిని మంగళవారం కలిశారు. ఎస్కేయూ స్నాతకోత్సవాన్ని దిగ్విజయంగా నిర్వహించినందుకు వీసీకి అభినందనలు తెలిపారు. ఆంటియా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. పురుషోత్తం రెడ్డి, బోధనేతర సంఘం సెక్రటరీ శాంతలింగం, వైస్ ప్రెసిడెంట్ రా ము, మాజీ వైస్ ప్రెసిడెంట్ నాగభూషణం పాల్గొన్నారు.

పోస్టులు భర్తీ చేయండి

రాప్తాడురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో డీఎస్సీ ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావుకు ప్రత్యేక విద్య అభ్యర్థులు విన్నవించారు. మంగళవారం నగరంలోని ఎస్పీడీని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం–2009 అమెండ్మెంట్ ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 5:1, ఉన్నత పాఠశాలల్లో 15:1 రేషియో ప్రకారం ప్రత్యేక టీచర్లు ఉండాలన్నారు.ఎస్పీడీని కలిసిన వారిలో పత్యేక విద్య అభ్యర్థుల సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి అంజనయ్య, ఉప కార్యదర్శి ఓబులేసు, ప్రశాంత్, శిరీష, రాధమ్మ, బాలాజీ పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని నాయక్‌నగర్, రెండో రోడ్డు, ఉమానగర్ ప్రాంతాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే లబ్ధిదారులకు సర్టిఫికెట్లు, రేషన్‌కార్డులను మంజూరు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 11 రకాల సర్టిఫికెట్లతో పాటు ఇంకా సమస్యలుంటే జగనన్నకు చెబుదాం, స్పందనలో తెలియజేయాలన్నారు.

ప్రభుత్వ మేలు మరువొద్దు:
సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు అనేక సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారని, ప్రభుత్వ మేలు మరువకూడదని ఎమ్మెల్యే అన్నారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు విద్య వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్న వలంటీర్లపై టీడీపీ, బీజేపీ, జనసేన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే నివాసంలో భవానీనగర్‌కు చెందిన దివ్యాంగుడు ఆదినారాయణకు ట్రైసైకిల్ అందించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చవ్వా రాజశేఖర్‌రెడ్డి, మాజీ మేయర్ రాగే పరుశురాం, కార్పొరేటర్లు సాకే చంద్రశేఖర్, సంపంగి రామాంజనేయులు, లీలావతి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, నాయకులు మిద్దె నగేష్, ఉషా, లక్ష్మీజి, భారతి, గంగాధర్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం
అనంతపురం రూరల్: టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. అప్పట్లో చంద్రబాబు టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులకు దోచి పెట్టారని మండిపడ్డారు. మంగళవారం రుద్రంపేట, ఏ నారాయణపురం పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నూతన సచివాలయం, వైఎస్సార్ హెల్త్ సెంటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, సాదిక్‌వలి, కృష్ణవేణి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అంతా సుభిక్షం

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మద్దెలచెరువు 'జగనన్న సురక్ష' సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మద్దెలచెరువులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నామన్నారు. కనగానపల్లి మండలంలోని 4,459 మంది పేదళ్లకు ఇళ్ల మంజూరు చేయించటంతో జగనన్న కాలనీల్లో సొంతంగా ఇళ్లు నిర్మించి, ఇస్తున్నామన్నారు. వైఎస్సార్ జలకళతో పాటు తోపుదుర్తి ట్రస్టు ద్వారా మండలంలో వెయ్యి మందికిపైగా రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్నామన్నారు.

పరిటాల కుటుంబానిది పెత్తందారి పోకడ: గతంలో గ్రామాల్లో ఉన్న ఫ్యాక్షన్, వర్గాలను అడ్డంపెట్టుకొని రాజకీయాలు సాగించిన పరిటాల కుటుంబం పెత్తందారి పోకడలను ప్రోత్సహించిందని ఎమ్మెల్యే అన్నారు. తద్వారానే 20 ఎకరాలు పొలం ఉన్న యజమానుల నుంచి రూ.2 వేల కోట్ల ఆస్తులకు పడగలెత్తారని విమర్శించారు. వారి ఫ్యాక్షన్ రాజకీయాలతో మద్దెలచెరువు, తగరకుంట, కనుముక్కల వంటి గ్రామాల్లో ఎంతోమంది పా ప్రాణాలు బలి తీసుకున్నారన్నారు. ప్రస్తుతం ప్రశాంతమైన సుపరిపాలన అందిస్తున్నామన్నారు. మద్దెలచెరువులో 600 మందికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, వైస్ ఎంపీపీలు నరసింహారెడ్డి, పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, గంగుల సుధీర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీరుల పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం
కనగానపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్య స్థాపన తీసుకొచ్చారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. మంగళవారం భానుకోటలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు మండల కేంద్రంలో మొహర్రం వేడుకల సందర్భంగా దస్తగిరి, కుళ్లాయిస్వామి పీర్లను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. పంచాయతీరాజ్ డీఈ రసూల్, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ బెడుదూరి గోపాల్‌రెడ్డి, మండల అగ్రిబోర్డు చైర్మన్ వెంకటరాముడు, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతీప్రసాద్, డైరెక్టర్ ప్రభాకర్, కాంట్రాక్టర్ పరంధామరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పలువురు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉద్దేశపూర్వకంగానే రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం'


మాట్లాడుతున్న తోపుదుర్తి, సనప గ్రామస్తులు

ఆత్మకూరు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెడ్డపేరు రావాలని ' కేసీవీఆర్ కన్‌స్ట్రక్షన్స్' వారు బి.యాలేరు నుంచి కనగానపల్లి మండలం తగరకుంట వరకు చేయాల్సిన రోడ్డు పనులను నిర్లక్ష్యం చేస్తున్నారని సనప, తోపుదుర్తి గ్రామాల ప్రజలు మండిపడ్డారు. మంగళవారం తోపుదుర్తిలో తోపుదుర్తి ఎంపీటీసీ పోతులయ్య, సర్పంచ్ ఓబులేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సనప గోపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సొంత డబ్బుతో ఉచిత బోర్లు వేయించి రైతులకు అండగా నిలుస్తున్నారని, అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి, వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి, ఎంతో మందికి అండగా నిలిచారన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే ఆదేశించినా పట్టించుకోవడంలేదన్నారు. కాంట్రాక్టర్లు తమకు అనుకూలంగా ఉన్న వారితో చేతులు కలిపి ఎమ్మెల్యేకు చెడ్డపేరు తీసుకురావాలని రోడ్డు పనులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.ఒక కల్వర్ట్ నిర్మాణానికి మూడు నెలల సమయం తీసుకుంటున్నారని, రోడ్డుకు కావాల్సిన మట్టి, కంకర ఎమ్మెల్యే సమకూరుస్తున్నా..పనులు వేగవంతం చేయలేదన్నారు. రోడ్డు పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్లు పనులు వేగవంతంగా పూర్తి చేయకపోతే జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తోపుదుర్తి గ్రామ ప్రజలు బిల్లే పెదయ్య, వార్డు మెంబర్ పోతులయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, మాదన్న పాల్గొన్నారు.

పోస్టర్లు అతికిస్తే చర్యలు

అనంతపురం క్రైం: నగరంలోని డివైడర్లు, పబ్లిక్ స్థలాలు, గోడలపై ఎలాంటి పోస్టర్లు అతికించరాదని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) బాలాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నోటీసు అండర్ సెక్షన్ 420,421, 596 ఆఫ్ హెచ్ఎంసీ యాక్ట్ 1995 కింద చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో హెచ్చరించారు.

ఉచిత శిక్షణ కేంద్రాల ఏర్పాటు అభినందనీయం

అనంతపురం టవర్‌క్లాక్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు జిల్లాల్లో యూపీఎస్సీ, గ్రూప్–1,2కు ప్రిపేర్ అయ్యేందుకు ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని యునైటెడ్ ట్రైబల్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే గాయిత్రి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి జిల్లాలోనూ యూపీఎస్సీ, గ్రూప్–1, 2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కేంద్రాలను స్థిరంగా ఏర్పాటు చేయాలన్నారు.

మతోన్మాద హింస అరికట్టాలి


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

అనంతపురం అర్బన్: మణిపూర్‌లో చోటు చేసుకున్న ఘటనలను ఖండిస్తూ సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు స్థానిక లలిత కళాపరిషత్ నుంచి టవర్ క్లాక్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మతోన్మాద హింసను అరికట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అని ప్రధాని నరేంద్ర మోదీ గొప్పగా చెప్పే మాటల్లో డొల్లతనం తేటతెల్లమైందన్నారు. రెండు నెలలకు పైగా మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ, అత్యాచారాలకు అడ్డుకట్ట వేడయంలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. మణిపూర్‌లో పరిస్థితిని అదుపు చేయడంలో ఆ రాష్ట్ర సర్కార్ విఫలమైనప్పుడు ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. మణిపూర్ ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, రామిరెడ్డి, ముత్తూజ, వెంకటనారాయణ, ఆదినారాయణ, లక్ష్మీనరసమ్మ, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మానవ మృగాలను ఉరితీయాలి
రాప్తాడు: మణిపూర్ ఘటనలో మానవ మృగాలను ఉరితీయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి అన్నారు. మంగళవారం రాప్తాడులో సీపీఐ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్యా ఆధ్వర్యంలో మానవ మృగాలను ఉరి తీయాలని కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ మణిపూర్ ఘటన అంత్యంత హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, మహిళా సమైఖ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలతోనే నిందితుడి ఆత్మహత్య


వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

అనంతపురం శ్రీ కంఠం సర్కిల్: పోక్సో కేసులో నిందితుడు నరసింహులుపై పోలీసులు అసత్య ఆరోపణలు చేయడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షుడు బి. నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం డీఐజీ కార్యాలయంలో మేనేజర్‌కు న్యాయవాది ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల18న తెల్లవారుజామున తనకల్లు మండల కేంద్రంలో పోక్సో కేసు నిందితుడు మదిగొల్ల నరసింహులు (56) ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. నరసింహులు వైఎస్సార్‌సీపీలో చురుకైన కార్యకర్తగా అని, అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అతనిపై తప్పుడు కేసు బనాయించి, 3 నెలలు జైలుకు పంపారన్నారు. చేయని తప్పుకు జైలుకు వెళ్లానని మానసికక్షోభకు గురయ్యాడన్నారు. సదరు కేసు ప్రస్తుతం అనంతపురం పోక్సో కోర్టులో విచారణ జరుగుతుండగా, అంతకు ముందురోజు కోర్టులో ప్రాసిక్యూషన్ వారు నిందితుడు సాక్షులను బెదిరిస్తున్నాడని జడ్జికి అసత్య ఆరోపణలతో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఆయన మరింత మానసిక ఒత్తిడికి గురై అదేరోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ప్రాసిక్యూషన్ వాస్తవాలను పరిశీలించకుండా కోర్టులో ఫిర్యాదు చేయడం అన్యాయమన్నారు. నరసింహులు ఆత్మహత్యకు కారకులపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేసి, చట్టపరంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్‌రెడ్డికి కూడా ఫిర్యాదు చేశామన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

• నిర్వాహకులకు నగర డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సూచన


మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్ రెడ్డి

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని నగర డీఎస్పీ ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ సీఐ రెడ్డప్పతో కలిసి పీర్ల చావిడి మంటపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మొహర్రం వేడుకలను కులమతాలకతీతంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. మొహర్రం వేడుకల్లో కీలకమైన పీర్ల చావిడి, మంటపాలు ఏర్పాటు చేసేందుకు పోలీస్ స్టేషన్లలో అనుమతి తీసుకోవాలన్నారు. పీర్ల చావిడి, మంటపాలు ఏర్పాటుకు ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కమిటీ వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ, నగర పాలక సంస్థ లేదా ప్రైవేట్ స్థలాల్లో పీర్ల చావిడి, మంటపాలు ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత స్థల యజమానిగానీ, సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పీర్ల ఊరేగింపు ఉత్సవం నిర్వహించే శబ్ద కాలుష్య క్రమబద్ధీకరణ , నియంత్రణ నిబంధనలు–2000 ప్రకారం నడుచుకోవాలన్నారు. చావిడి లేదా మంటపాలు ఏర్పాటు కానీ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించరాదన్నారు.

రాప్తాడు: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలైన గొందిరెడ్డిపల్లి, ఎం.బండమీదపల్లి గ్రామాల్లో మొహర్రం పండుగపై గ్రామ సభ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 30న మొహర్రం పండుగను రెండు గ్రామాల ప్రజల ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. మొహర్రంలో డీజే, డ్రమ్స్ వాడరాదని, కులమతాలకతీతంగా సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు


సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


మరూరులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి అన్నారు. మంగళవారం మరూరులో మండల ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచినేని కొండారెడ్డి, సర్పంచు ప్రభావతి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ నాయకులు సత్యనారాయణ రెడ్డి, నారాయణస్వామి, మాచినేని చెన్నారెడ్డి, శ్రీనివాసులు, రవి ప్రకాష్, పసుపుల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రాచానపల్లిలో 'జగనన్న సురక్ష'
రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో మంగళవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీడీఓ పుల్లయ్య మాట్లాడారు. ప్రజల వద్దకే ప్రభుత్వం వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బాషా, సర్పంచ్ అంజియాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి, వై. రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు బాలకృష్ణ, డీలర్ రామాంజి, అశోక్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
ఆత్మకూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. మంగళవారం మండలంలోని పి.యాలేరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, సర్పంచులు ఆరోగ్యం రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ నీలిమ, కన్వీనర్ బాలపోతన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫణిరెడ్డి, అతికిరెడ్డి, వన్నూరప్ప, పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.